క్లుప్తంగా

రామాలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఎస్.చెన్నంపల్లెలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి అంకిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కేపీ రామ్మోహన్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులకు ఆయన నివాసంలో అందజేశారు. ఇప్పటికే దాతల సహకారంతో ఆలయం సగానికి పైగానే పూర్తయింది. ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అడిగిన వెంటనే విరాళం ఇచ్చిన కేపీని కమిటీ సభ్యులు అభినందించారు.

దక్షిణామూర్తి ఆలయంలో పూజలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో నిర్మించిన దక్షిణామూర్తి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ట పూర్తి చేసి 41 రోజుల పూర్తయిన సందర్భంగా కాణిపాకం దేవస్థానానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హోమ పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం



భాస్కర్‌నాయుడిని సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నేతలు

డోన్ టౌన్: ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది శీలం భాస్కర్‌నాయుడిని చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామానాయుడు ఆధ్వర్యంలో వాల్మీకి సంఘీయులు ఘనంగా సత్కరించారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో పట్టుశాలువ, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. న్యాయవాదులు వెంకటేశులు, లక్ష్మన్న, వాల్మీకి సంఘం నేతలు విజయమోహన్‌నాయుడు, టెంకాయల కేశవయ్య, మాధవస్వామి, నాగేంద్ర పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ



బీసీ కళాశాల వసతి గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం, బీసీ కళాశాల వసతి గృహాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని సివిల్ సప్లైస్ గోడౌన్‌తో పాటు ఆంజనేయస్వామి ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట పీఆర్ డీఈఈ నాగశ్రీనివాసులు, ఏఈ రమణ ఉన్నారు.

సేవ చేయడం మానవుని ధర్మం



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను శనివారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున నగదు పంపిణీ చేశారు. ప్రకృతి పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, సభ్యులు తిమ్మారెడ్డి, మహేష్‌రెడ్డి, బిలాల్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి వేళాయె

- నేడు శ్రీరామనవమి వేడుకలు
- ముస్తాబైన రామాలయాలు



కోవెలకుంట్ల ఆలయంలోని సీతారాముల విగ్రహాలు



బేతంచెర్లలో పలకచింతమాన్ ఆంజనేయస్వామి ఆలయం



గుళ్లదూర్తిలోని చిన్నమ్మ ఆశ్రమంలో వెలసిన పురాతన రామాలయం



కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో ముస్తాబు చేసిన కల్యాణ వేదిక

కోవెలకుంట్ల: శ్రీరామనవమిని పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో రామాలయాలు ముస్తాబయ్యాయి. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేట, ముదిగేడు చౌరస్తా, శ్రీరాంనగర్, సీతారామనగర్, గాంధీనగర్‌తో పాటు మండలంలోని భీమునిపాడు, కంపమల్ల, కలుగొట్ల, జోళదరాశి, లింగాల, రేవనూరు, వెలగటూరు, బిజనవేముల, అమడాల, సౌదరదిన్నెల్లో వెలసిన రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుళ్లదూర్తి చిన్నమ్మ ఆశ్రమంలో వెలసిన పురాతన రామాలయంలో భద్రాది తరహాలో శ్రీరాముని కల్యాణ వేడుకలు జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణం అనంతరం ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

- డోన్: శ్రీరామనవమి ఉత్సవాలకు డోన్ మండలంలోని అన్ని రామాలయాలతో పాటు హనుమాన్ దేవాలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు సీతారాముల కల్యాణం, రథోత్సవం, వసంతోత్సవాలు నిర్వహించనున్నారు.
- బేతంచెర్ల: మండలంలోని రామాలయాలను మామిడి తోరణాలు, వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పట్టణ సమీపంలోని పలకచింతమాను అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. బైటిపేట గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయం, సంజీవనగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో కబడ్డీ, బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.
- కొలిమిగుండ్ల: సీతారాముల కల్యాణం లోక కల్యాణానికి కారకం. జగదభిరాముని కల్యాణ వీక్షణం పూర్వ జన్మ సుకృతం. అందుకే ఏటా శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని తెలుగు వారందరూ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పల్లెల్లో అంగరంగవైభవంగా జరుపుకుంటారు. ఆదివారం శ్రీరామనవమి పండుగ రోజున అంకిరెడ్డిపల్లెలోని రామాలయం ఆవరణలో స్వామివారికల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ వేదికను ప్రత్యేకంగా తెప్పించిన పూలతో అందంగా ముస్తాబు చేయించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొలిమిగుండ్ల, బెలుం, పెట్నికోట, కల్వటాల, తిమ్మనాయినపేట, యర్రగుడి, పెద్ద వెంతుర్ల, కోటపాడు, ఇటిక్యాల తదితర గ్రామాల్లో కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

అక్రమ కేసులకు భయపడం

- హెచ్చుమీరిన కూటమి అరాచకాలు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- గత ప్రభుత్వంలో సంక్షేమం.. ప్రస్తుత పాలన సంక్షోభం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులకు భయపడేది లేదని.. అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లిస్తామని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం అవుకులో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యవర్గ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులను కాటసాని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయండంపై ఉన్న ఆసక్తి హామీల అమల్లో లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలు అధికమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం చేసే అరాచకాలను సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టే వ్యక్తులపై కక్షసాధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అక్రమంగా కేసులు పెట్టి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, హామీల అమల్లో జాప్యంపై ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.

నాడు సంక్షేమం..నేడు సంక్షోభం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్ చేయూత, పింఛన్ పెంపు, ఆరోగ్యశ్రీ, అందరికీ ఇళ్లు, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో అండగా నిలిచారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. అవుకు మండలం చెర్లోపల్లె, రామాపురం, సంగపట్నం గ్రామాల్లో మైనింగ్ చూసుకునే రైతులను బెదిరించి గనులను లాక్కుంటున్నారని ఆరోపించారు. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు వాయునందగౌడు, రామన్న, సుబ్రమణ్యం, పేరం వెంకట సుబ్బారెడ్డి, మేకల వెంకటేశ్వర్‌రెడ్డి, మధన గోపాల్ రెడ్డి, పార్థసారథి రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, మంచాల నాగేశ్వర్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, రాముడు నాయక్, నర్సిరెడ్డి, సుబ్బన్న తదితరుల పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కోవెలకుంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బనగానపల్లె నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాల మండల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

విభాగం	సంజామల	అవుకు	కొలిమిగుండ్ల
యూత్ విభాగం	టి. వెంకటేశ్వరరెడ్డి	ఎం. నర్సిరెడ్డి	కె. సోమశేఖర్‌రెడ్డి
మహిళా విభాగం	జి. ఆదిలక్ష్మి	పి. ప్రత్యూష	ఎస్. సులోచన
రైతు విభాగం	ఏ. శివరామిరెడ్డి	ఎం. నాగేశ్వరరెడ్డి	పి. సూర్యనారాయణరెడ్డి
బీసీసెల్	పి. సత్యమయ్య	పి. పురుషోత్తంనాయుడు	రామాంజనేయులు
ఎస్సీసెల్	అల్లూరి ఏసయ్య	ఎం.రామారావు	ఎం. పుల్లయ్య
ఎస్టీసెల్	ఎస్.రామకృష్ణ	ఎస్. రాముడునాయక్	ఎస్. గోపాల్‌నాయక్
మైనార్టీ సెల్	షేక్ అమీర్ ఉసేన్	ఎస్. ఉసేన్‌వలి	కె. ఉసేన్‌బాషా
క్రిస్టియన్ మైనార్టీ	రామోజీబుజ్జి	పి. చిన్నబాబు	నడిపి సుంకన్న
స్టూడెంట్	ఏ. యువరాజ్	కె. కార్తీక్	ఎం. హరికిరణ్
పంచాయతీరాజ్	ఆర్. రహంతుల్లా	జె. రవీంద్రారెడ్డి	ఎస్. శివారెడ్డి
ఆర్‌టీఐ	డి. సుధాకర్‌రెడ్డి	జి. అయ్యపురెడ్డి	వై. పెద్దిరెడ్డి
వలంటీర్స్	లక్ష్మి నరసింహారెడ్డి	జి. మదనగోపాల్‌రెడ్డి	ఏ. నాగేశ్వరరావు
వీవర్స్	బాలసుబ్బయ్య	కె. నాగసుబ్బరాయుడు	పి. ఓబులేసు
వాణిజ్య	గౌరిగారి నాగేశ్వరరెడ్డి	ఎం. వెంకటసుబ్బన్న	జి. వెంకటసుబ్బయ్య
వైఎస్సార్‌టీయూసీ	ఉసేన్‌బాషా	సి. ఆంజనేయులు	ఏ. లంకేశ్వరరెడ్డి
అంగన్‌వాడీ	మహబూబ్‌బాషా	టి. చెన్నప్ప	బి. ప్రభావతి
కల్చరల్	జి. దేశాయ్‌రెడ్డి	ఎం. విశ్వనాథరెడ్డి	వై. వెంకటేశ్వరరెడ్డి
సోషల్ మీడియా	డి. నాగేశ్వరరెడ్డి	ఎం. ప్రమోద్‌గౌడ్	బి. రాజుయాదవ్
దివ్యాంగులు	జి. చెన్నయ్య	ఎస్. కరిముల్లా	రాజగోపాల్
పబ్లిక్	జి. సంతోష్‌కుమార్	పి. భాస్కర్‌రెడ్డి	ఎస్. చంద్రారెడ్డి

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని బీఆర్‌ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీపీ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలు తదితర అంశాలపై బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన సమీక్ష జరుగుతుందన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

గుండెపోటుతో అంకిరెడ్డిపల్లె సర్పంచ్ మృతి



నాగన్న(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె సర్పంచ్ మాదిగ నాగన్న(55) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. రెండు నెలల క్రితం గుండె సంబంధ సమస్య రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో నాగన్న సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మృతదేహానికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కేపీ రామ్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సర్పంచ్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

8న వైఎస్సార్‌సీపీ సమావేశం

కొలిమిగుండ్ల: స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 8వ తేదీ వైఎస్సార్‌సీపీ కొలిమిగుండ్ల మండల నూతన కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నియోజవర్గ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి శనివారం అవగాహన కల్పించారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో పట్టణ సమీపంలోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులకు రోడ్డు ప్రమాదాలపై వీడియోల ద్వారా తెలియజేశారు. ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని.. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి ఇంటర్‌మీడియెట్ వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7075159996, 7075039990 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అమ్మవారికి వెండి కిరీటం విరాళం



కిరీటం అందజేస్తున్న దాత

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో వెలసిన రేణుకా యల్లమాంబేశ్వరి అమ్మవారికి పత్తికొండ ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మురళీ శ్రీనివాసులు వెండి కిరీటాన్ని కానుకగా సమర్పించారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజుకు అందజేశారు. శ్రీరామ నవమి పండుగ రోజున భక్తులకు దాత అల్పాహారం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నాగరాజు తెలిపారు. దాతకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. విజేత జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ. 25వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. అలాగే 8వ తేదీ గిరక బండి పందెం పోటీలు జరుగుతాయన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు నగదుతో పాటు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎద్దుల ఆరుపండ్ల విభాగం రాతిదూలం పోటీల్లో విజేతలకు శనివారం నగదు బహుమతులు పంపిణీ చేశారు. రాయవరానికి చెందిన అక్షరారెడ్డి వృషభాలు ఒడటి స్థానంలో నిలిచాయి. రెండో బహుమతి పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి, మూడో బహుమతి కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి, నాల్గో బహుమతి కలసపాడుకు చెందిన బి.వెంకటరెడ్డి, ఐదో బహుమతి టంగుటూరికి చెందిన రాఘవేంద్రారెడ్డి, కానాలకు చెందిన సుబ్రమణ్యం, ఆరో బహుమతి గుండ్లగుంటకు చెందిన మర్రిబోయిన వంశీయాదవ్, నాగయ్యపల్లెకు చెందిన వర్షారెడ్డి, ఏడో బహుమతి దొర్నిపాడుకు చెందిన కృష్ణయ్య యాదవ్, దాసరిపల్లెకు చెందిన దీపరాజునాయుడు నిలిచారు. ఇక ఎనిమిది, తొమ్మిది బహుమతులు కోటకందూరుకు చెందిన గోసలక్ష్మీశరణ్య, కొత్తపల్లికి చెందిన గొల్లప్రసాద్, నర్సిపల్లికి చెందిన ఉప్పరి లక్ష్మీదేవి వృషభాలు సమాన దూరం లాగాయి. 10వ బహుమతి గద్వాలకు చెందిన వంశీకృష్ణ, మాదనుపల్లెకు చెందిన శివప్రసాద్, 11వ బహుమతి చిన్నకానాలకు చెందిన సుంకన్న, 12వ బహుమతి చండ్లపల్లికి చెందిన సోములరంగారెడ్డికి చెందిన వృషభాలు దక్కించుకున్నాయి. వీరికి దాతల సహకారంతో వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.25 వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి, లక్ష్మీరెడ్డి, వెంగన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని దొరపల్లె రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలైనట్లు పట్టణ పోలీసులు తెలిపారు. శనివారం బెంగళూరుకు చెందిన సయ్యద్ కలాద్ అహమ్మద్ కారులో హైదరాబాద్‌కు వెళుతున్నాడు. దొరపల్లెకు చెందిన బాల సురేష్‌బాబు డోన్ వైపు ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తుండగా కారు వెనుకకు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలసురేష్‌కు గాయాలయ్యాయి. బాధితుని ఫిరాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాబూ జగ్జీవన్‌రాంకు నివాళి



డోన్‌లో నివాళులర్పిస్తున్న సీఐ, పోలీసులు,



బేతంచెర్లలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, ఎంఈఓ

స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతిని డోన్, బనగానపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఆయా కార్యాలయాలు, గ్రామాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అంటరానితనాన్ని నిర్మూలించడానికి ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసిక్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో జగ్జీవన్‌రాం కీలకపాత్ర పోషించారని కొనియాడారు. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. –సాక్షి నెట్‌వర్క్



సంజామల: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్,



బనగానపల్లెలో ఎంపీడీఓ వెంకటరమణ



ప్యాపిలి: జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



డోన్ యూటీఎఫ్ కార్యాలయంలో..